క్లుప్తంగా

శివకుమార్‌కు పురస్కారం


పురస్కారం అందుకున్న శివకుమార్, తదితరులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంకు చెందిన డాక్టర్ మద్దెల శివకుమార్ సి.నారాయణరెడ్డి సాహిత్య సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదనాచారి, సీనియర్ నటీమణి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో ఇంకొందరికి కూడా పురస్కారాలు అందజేశారు.

నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ


నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం తిప్పకుంట, గట్టుమళ్ల, బాబోజీతండా, కొత్తూరు ప్రాథమిక పాఠశాలల్లోని 150 మంది గిరిజన విద్యార్థులకు టీం సంభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.లక్ష విలువైన బ్యాగులు, నోటు పుస్తకాలు, స్టేషనరీ ఉచితంగా శనివారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు సత్యప్రసాద్, పృథ్వీ, పురుషోత్తం పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జూలూరుపాడు: గత విద్యాసంవత్సరంలో జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

పాల్వంచ: విద్యార్థులను తీర్చిదిద్దాలని విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ చింతకింది కృష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక బొల్లేరుగూడెంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వరంగల్, ఖమ్మం విభాగ్‌లలో పనిచేస్తున్న ఆచార్యులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యార్థులకు విద్యాబోధనలో మెళకువలను సూచించారు. కార్యక్రమంలో ఆకుల ఆనంద్, పల్లి రాజేశ్వరరావు, రామానుజమ్ పాల్గొన్నారు.

సామూహిక సీమంతం


చీరె, సారె అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: రోటరీ మెటర్నల్ చైల్డ్ హెల్త్ వారోత్సవాల్లో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో గాజులరాజం బస్తీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ వార్డ్ కౌన్సిలర్ బాలిశెట్టి సత్యభామ హాజరై మాట్లాడుతూ.. గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం సామాజిక సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల రవికుమార్, శ్రీరామనేని చలపతిరావు, సీనియర్ రొటేరియన్లు అంకం పాపయ్య, సిరిమల్ల సత్యనారాయణ, సుజాత, దుర్గారాణి, ఆనంద్‌కుమార్, నాగరాజశేఖర్, పగడాల సుధారాణి, భాస్కర్ పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు గొడుగులకు గిరాకీ..






కొత్తగూడెంలో ఫుట్‌పాత్‌పై గొడుగులు, రెయిన్ కోట్లు అమ్ముతున్న చిరువ్యాపారులు

- కొత్తగూడెంలో పలుచోట్ల అమ్మకాలు
- వరుస వర్షాలకు కొనుగోలు చేస్తున్న ప్రజలు
- హైదరాబాద్, విజయవాడ నుంచి చిరువ్యాపారుల దిగుమతి

కొత్తగూడెంఅర్బన్: ఎడతెరపిలేకుండా వానలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు గొడుగులు, రెయిన్ కోట్లు అత్యవసరం అయింది. వర్షాకాలంలో మూడు నెలలు మాత్రమే గొడుగులు, రెయిన్‌కోట్లు ఉపయోగించి ఆ తరువాత పక్క పడేస్తుండడం వలన అవి మరుసటి ఏడాదికి పని రాకుండా మారడం వలన ఎక్కువ మంది ప్రతీ ఏడాది కొత్తవి కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తుంటారు. ఇందులో భాగంగా ఐదు రోజులుగా కొత్తగూడెంలో జల్లులు, ఓ మోస్తారు వర్షాలు పడుతుండడంతో పనులపై ఇంటి నుంచి బయటకు వెళ్లే వారికి గొడుగులు, రెయిన్ కోట్లు అవసరం ఏర్పడింది. దీంతో కొత్తగూడెంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నారు. వర్షంలో తడిస్తే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తడవకుండా ఉండేందుకు గానూ ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలో హెడ్డాఫీసు సెంటర్ మొదలుకొని పోస్టాఫీసు సెంటర్, ప్రకాశం స్టేడియం ఎదురు రోడ్డు, సూపర్‌బజార్, పెద్దబజార్, గణేష్‌టెంపుల్ ఏరియాలలో రెయిన్ కోట్లు, గొడుగుల దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఆయా వ్యాపారులు హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి రకరకాల మోడళ్లలో రెయిన్ కోట్లు, గొడుగులను దిగుమతి చేసుకొని అమ్మకాలు చేస్తున్నారు.

చిన్నారులకు సైతం ప్రత్యేక గొడుగులు..

కొత్తగూడెంలోని వివిధ షాపులలో అమ్మకాలు చేస్తున్న రెయిన్ కోట్లు, గొడుగులలో వివిధ రకాల మోడళ్లు, కంపెనీలున్నాయి. వాటికి తగ్గట్టుగా వివిధ రకాల ధరలలో అమ్మకాలు చేస్తున్నారు. గొడుగులు చిన్న పిల్లలు వాడేవి, పెద్దవారు ఉపయోగించేవి, వర్షంలో తడవకుండా ముగ్గురికి సరిపడే పెద్ద గొడుగులు కూడా అమ్ముతున్నారు. గొడుగులు రూ.200 – రూ.1000 వరకు, రెయిన్ కోట్లు పిల్లలవి రూ.300, మహిళలవి రూ.500 వరకు, మగవారికి రూ.800 – రూ.1000 వరకు అమ్మకాలు చేస్తున్నారు. రెయిన్ టోపీలు రూ.150 వరకు అమ్ముతున్నారు.

సండే స్పెషల్

ఏటా కొనుగోలు చేస్తున్నాం..



వర్షంలో తడవకుండా ఉండేందుకు గానూ గొడుగులు తప్పని సరిగా వినియోగించాల్సిన అవసరముంది. అయితే వర్షకాలంలో వినియోగించి పక్కన పడేయడం వలన రెయిన్ కోట్స్ గాని, గొడుగులు కాని చినిగిపోవడం, రంధ్రాలు పడడం వలన మళ్లి వినియోగించడం కష్టతరంగా మారుతుంది. దీని వలన కొత్తవి కొనుగోలు చేయాల్సి వస్తుంది.

– శ్రీనివాస్, కొత్తగూడెం

హైదరాబాద్, విజయవాడ నుంచి తీసుకొస్తున్నాం..



ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో గొడుగులు, రెయిన్ కోట్లకు గిరాకీ ఉంది. హైదరాబాద్, విజయవాడ నుంచి తెచ్చి అమ్ముతున్నాం. వినియోగదారుల అవసరాన్ని బట్టి వివిధ రకాలు, మోడళ్లలో ఉన్న తేస్తున్నాం. చిన్న పిల్లలకు సైతం వివిధ మోడళ్లలో గొడుగులు, రెయిన్స్ కోట్లు వచ్చాయి. క్వాలిటీని బట్టి రేట్లు నిర్ణయించి అమ్ముతున్నాం.

– సరిత, వ్యాపారి

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలి


డీఎంఓ అలీంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు శనివారం ఖమ్మం డీఎంఓ ఎంఏ అలీంను ఏన్కూర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ కన్వీనర్ బానోత్ ధర్మా మాట్లాడుతూ... ఎన్నో పోరాటాల ఫలితంగా 20 ఏళ్ల క్రితం ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉప మార్కెట్ యార్డును ఏర్పాటు చేసి, పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కోసం 11 ఎకరాల భూమిని కేటాయించిందని, ఆ స్థలంలో గుట్టలు, చెట్లు, పొదలతో నిండి ఉందన్నారు. ఆ స్థలాన్ని శుభ్రం చేసి, పత్తి కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉప మార్కెట్ ద్వారా ఏటా సెస్ రూపంలో రూ.లక్షల ఆదాయం వస్తోందన్నారు. శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అధికారులకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. అంతకముందు ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బజారుతో కలిసి మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని డీఎంఓ అలీం పరిశీలించారు. యాసా నరేష్, లకావత్ నాగేశ్వరరావు, బానోత్ మధు, రాజాకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి


ధర్నా చేస్తున్న జడలచింత గ్రామస్తులు

జూలూరుపాడు: జూలూరుపాడు నుంచి పాపకొల్లు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపివేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. వీరికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపి ప్రజలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నరేష్, బాధితులు మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. డ్రైనేజీలు నిర్మించకుండా రోడ్డు పనులు చేపట్టడంతో వర్షపు నీరంతా ఇళ్లలోకి వస్తోందని, ఇళ్లలోని నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు అంగీకరించలేదు. మాజీ సొసైటీ చైర్మన్ పీజీ కృష్ణమూర్తితో ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేయించి ఆందోళనకారులతో మాట్లాడించారు. రోడ్డు పనులు త్వరలో పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సింగరేణి కాలేజీలో సింపోజియం


మాట్లాడుతున్న భార్గవిశర్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా గణిత శాస్త్రం, గణాంక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శనివారం కాన్సెప్ట్ ఆఫ్ రియల్ అనాలసిస్, అప్లికేషన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఇన్ రియల్ లైఫ్ అనే అంశాలపై సింపోజియం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గణిత శాస్త్ర హెచ్‌ఓడీ డాక్టర్ ఆర్.భార్గవిశర్మ, కేయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ జె.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భార్గవిశర్మ మాట్లాడుతూ... గణితంలోని రియల్ నంబరు లక్షణాలు, శ్రేణీకృత సంబంధాలు, అంతరాల గురించి, జియో మెట్రిక్ రిప్రజెంటేషన్, టొపాలాజికల్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు వివరించారు. డాక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణాంకంలోని డేటా సేకరణ, ప్రాథమిక, ద్వితీయ డేటా, డేటా విశ్లేషణ, వినియోగాల ప్రాముఖ్యతను వివరించారు. గౌరవ అతిథిగా హాజరైన కళాశాల ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ జి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థినులు గణితం, గణాంక విభాగాలలో మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి సింపోజియంలు అవగాహనకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద మాట్లాడుతూ... విద్యార్థినులకు గణితం జీవితాన్ని చూపించే సాధనమనన్నారు. డాక్టర్ పి.నాగసంతోషి, బి.రాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పీవైఎల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కొమరారం గ్రామంలో పీవైఎల్ నేతలు శనివారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు ధరావత్ దేవా, ఎలుగు శాంతారావు మాట్లాడుతూ.. సమాజ మార్పు, అభివృద్ధిలో అగ్రభాగాన నిలబడే యువతను పాలకవర్గాలు విస్మరిస్తున్నాయని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నేడు నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఆశచూపి ఆ తరువాత పట్టించుకోవడం లేదన్నారు. మద్యం, డ్రగ్స్, మత్తు పదార్థాల విచ్చలవిడి విక్రయాల వల్ల యువత చెడుదోవ పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆయా సమస్యలపై యువతను ఐక్యం చేసి పోరాట కార్యక్రమాల రూపకల్పనకు హైదరాబాద్‌లో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రమేష్, నరసిహారావు, సందీప్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చంపాలాల్‌కు సన్మానం


చంపాలాల్‌ను సన్మానిస్తున్న పోలీసులు

సుజాతనగర్: ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సర్వారం గ్రామ పంచాయతీ, హరిలాల్‌తండాకు చెందిన మాలోత్ చంపాలాల్‌ను ఎస్‌ఐ ఎం.రమాదేవి ఆధ్వర్యంలో శనివారం అభినందించారు. సర్వారం గ్రామానికి చెందిన మాలోత్ గ్యామా, సాలి దంపతుల రెండో కుమారుడు ఒకేసారి రెండు కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఈ నేపథ్యంలో చంపాలాల్‌తో పాటు అతని తల్లిదండ్రులకు స్వీట్లు తినిపించి శాలువాతో సన్మానించారు.

విద్యార్థుల ప్రతిభ

కొత్తగూడెంఅర్బన్: పశ్చిమబెంగాల్ సురోభారతి సంగీత కళాకేంద్ర, క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన ఆలిండియా టాలెంట్ సెర్చ్ పరీక్షలో కొత్తగూడెం విద్యార్థులు ప్రతిభ చాటారు. గోల్డ్ మెడల్స్ సాధించిన అక్షయ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కొత్తగూడెం విద్యార్థులను డ్రాయింగ్ మాస్టర్స్ ప్రభాకర్ అంతోటి శనివారం అభినందించారు.

ప్రైవేట్ స్కూళ్ల అసోసియేషన్ సమావేశం

ఇల్లెందు: తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్య నందిస్తున్న ప్రైవైట్ స్కూళ్లలో చదువుకుంటున్న పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆర్థికంగా అందుబాటులో ఉన్న ప్రైవేట్ స్కూళ్లను ఆదరించాలని ట్రస్మా అనుబంధ ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇల్లెందు డివిజన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కోరింది. శనివారం ఇల్లెందులోని 14 నంబర్ బస్తీ మార్గదర్శినీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ట్రస్మా రాష్ట్ర నాయకుడు తుమ్మలపల్లి ప్రసాద్ మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపార ప్రకటనల ముందు తమ లాంటి బడ్జెట్ పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం, పౌర సమాజం కార్పొరేట్ విద్యాసంస్థలలో బడ్జెట్ పాఠశాలలను పోల్చవద్దన్నారు. తాము జీవనోపాధి పొందుతూ అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకుడు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వెంకటస్వామి, నామా సుధాకర్, డాక్టర్ సుధాకర్, యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ, మహేందర్, సర్వేశ్వరరావు, రాంచందర్, శ్రీను, రామకృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా


మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, హెల్త్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు ఆందోళన చేశారు. మేనేజర్ అంకుషావలీకి వినతిపత్రం అందజేశారు. శనివారం టీయూసీఐ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో సంఘం నేతలు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ నెల 31న కలెక్టరేట్ ఎదుట పని గంటల పెంపును నిరసిస్తూ జరగనున్న ఆందోళనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురునాథం, రంజాన్, రఘు, కృష్ణ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీక్


పెట్రాంచెలకస్టేజీ వద్ద వృథా అవుతున్న తాగునీరు

టేకులపల్లి: ప్రజలకు రక్షిత తాగునీటిని అందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన మిషన్ భగీరథ పైపులు తరుచూ లీకులకు గురవుతున్నాయి. తాజాగా శనివారం టేకులపల్లి మండలం పెట్రాంచెలక స్టేజీలో మిషన్ భగీరథ పైపులైన్ లీకైంది. తాగునీరు వృథా అవుతోంది. మండలం మొత్తం మీద పకడ్బందీగా మిషన్ భగీరథ నిర్వహణ జరుగుతోందని, సక్రమంగా నీటి సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ తరుచూ ఏదో ఒక గ్రామంలో భగీరథ పైపులైన్లు లీకవడం గర్హనీయం. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వరదొస్తే రాకపోకలు బంద్..

- వంతెనలు లేక వరద కష్టాలు
- దశాబ్దాలుగా కోరుతున్నా పట్టించుకోని పాలకులు, ప్రభుత్వం




హరిజన చెర్రి – రాంపురం మధ్య రాళ్లవాగు ఉధృతి, వెంకట్యాతండాస్టేజీ – బేతంపూడి మధ్య కరిసెలవాగు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో వర్షాకాలం వరద ప్రభావంతో ఏజెన్సీ ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రధానంగా అవసరమైన చోట లోలెవెల్, హైలెవెల్ వంతెనలు లేకపోవడంతో వరద ప్రభావం కారణంగా రాకపోకలు నిలిచి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. పాలకులు మారుతున్నా టేకులపల్లి ఏజెన్సీ ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. గతంలో అడపా దడపా వంతెనలు మంజూరై నిర్మించినప్పటికీ ఇంకా అనేక చోట్ల వంతెనల అవసరం ఉంది. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వాగులు, కాలువల సరిహద్దు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది. అనేక గ్రామాల్లో వర్షం వస్తే ఎటూ వెళ్లకుండా ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. అత్యవసర సమయాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. వ్యవసాయ పనులకు వెళ్లేవారు వాగు తగ్గే వరకు పొలాలకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం అవసరమైన చోట వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇక్కడ వంతెనలు నిర్మించాలి..

టేకులపల్లి మండలం పరిధిలో ప్రధానంగా ముర్రేడు, కిన్నెరసాని, పుణ్యపువాగు, మురికివర్రె, అలుగువొర్రె, పెద్దవాగు, బర్రిప్పవాగు, గుండం వాగు, రాళ్లవాగు, కరిసెలవాగు ఇవన్నీ ఒక్క వర్షానికే వరద నీరు భారీగా చేరి ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. ఈ కారణంగా ఇరువైపులా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తదితరులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. చింతలతండా – గుండ్లమడుగు మధ్య పుణ్యపు వాగు వరద ఉధృతి కారణంగా టేకులపల్లి – ఆళ్లపల్లి మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ – ప్రెగళ్లపాడు మధ్య, కోయగూడెం – మద్రాస్‌తండా మధ్య, కోయగూడెం రైస్‌మిల్లు వద్ద, పెట్రాంచెలక –పెట్రాంచెలక స్టేజీ, లక్ష్మీపురం – తడికలపూడి, హరిజనచెర్రి – రాంపురం, మద్రాస్‌తండా – కొండంగులబోడు, శంభునిగూడెం – అనిశెట్టిపల్లి, రోళ్లపాడు మార్గంలో బర్రిప్పవాగు వద్ద, గంగారం వద్ద, తూర్పుగూడెం – స్టేషన్‌బేతంపూడి, సులానగర్ – తూర్పుగూడెం, బేతంపూడి – కుంటల్ల, టేకులపల్లి – వయా వాగొడ్డుతండా బేతంపూడి మధ్య, వెంకట్యాతండా – బేతంపూడి నడుమ కరిసెలవాగు, చింతలంక – కొండంగులబోడు మధ్య, జండాలతండా వద్ద ఇలా తదితర గ్రామాల వద్ద హైలెవెల్, లోలెవెల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఏళ్ల తరబడి కోరుతూనే ఉన్నారు.

ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం...



తాతముత్తాతల కాలం నుంచి మండలంలో వర్షాకాలం వస్తే వరదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటం వల్ల ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వాగులు, కాలువల సరిహద్దు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి. ఎమ్మెల్యే చొరవ తీసుకుని వంతెనలు నిర్మించేందుకు కృషి చేయాలి.

– రేపాకుల శ్రీనివాస్, సీపీఎం నాయకుడు

వ్యవసాయానికి ఇబ్బందిగా ఉంది..



కల్వర్టుల వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటం వల్ల రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లాలంటే ఈ మార్గంలోనే వెళ్లాలి. పశువులు కూడా వాగు దాటలేని పరిస్థితి. ఎరువులు, విత్తనాలు ఇతర సామగ్రి తీసుకెళ్లాలంటే వాగు ఉధృతి తగ్గేదాక వేచి ఉండాల్సిన పరిస్థితి. అత్యవసరమైతే ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి వంతెనలు నిర్మించాలి.

– దుబాకుల ప్రసాద్, ఇఫ్టూ నాయకుడు

ఎమ్మెల్యే దృష్టిలో సమస్య..



ఇల్లెందు ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. మండలంలో ఇంకా వంతెనలు నిర్మించాల్సి ఉంది. వర్షాకాలంలో వరద వస్తే ఇబ్బందులు ఎదుర్కొనే ప్రాంతాలు, ఎక్కడెక్కడ వంతెనలు అవసరం ఉన్నాయో ఎమ్మెల్యే దృష్టిలో ఉంది. ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన మంజూరయ్యే విధంగా కృషి జరుగుతోంది.

– కోరం సురేందర్, కాంగ్రెస్ నాయకుడు

విద్యార్థి శక్తి దేశసేవకు ఉపయోగపడాలి


కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న ప్రొఫెసర్ చిన్నప్పయ్య


ఇల్లెందురూరల్: వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. వీరజవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిన్నప్పయ్య మాట్లాడుతూ.. 1999 భారత్, పాకిస్తాన్ మధ్య కార్గిల్ యుద్ధం జరిగిందని, ఇందులో భారత్ విజయం సాధించిందని ఈ సందర్భంగా ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.మధు, డాక్టర్ వెంకటేశ్వర్లు, దేవకి, పి.శివజ్యోతి, సునీత, అనిత, అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: దేశభక్తి మాటల్లో కాకుండా చర్యల్లోనూ ప్రతిఫలించాలని, అందుకు అనుగుణంగా విద్యార్థి శక్తి దేశసేవకు ఉపయోగపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ఖమ్మం నెహ్రూ యువ కేంద్రం, ప్రజ్వల యువజన సంఘం సంయుక్తంగా శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్గిల్ అమరులకు నివాళులర్పించి, వారి త్యాగాల స్మరణలో కళాశాల ఆవరణలో విరివిగా మొక్కలు నాటారు. అనంతరం కళాశాల విద్యార్థులు జాతీయ స్ఫూర్తిదాయక ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు కార్గిల్ యుద్ధం, భారత దేశ సైనికుల వీరత్వ గాథ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షుడు చింతమాల పాపయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.